మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత


సదస్సులో మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

చంచల్‌గూడ: మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత అని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. మంగళవారం చంచల్‌గూడలోని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు చెందిన శిక్షణ సంస్థ సీకా కార్యాలయంలో జైళ్లలో మత్తు పదార్థాల నివారణపై జరిగిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. జైళ్లకు వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఏదో ఒక మత్తు పదార్థానికి బానిసై ఉన్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని గాంధీ, ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 6 డీ-అడిక్షన్ కేంద్రాలను మంజూరు చేసిందన్నారు. జైళ్లలో మత్తు పదార్థాల నివారణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో డీజీ డా. సౌమ్య మిశ్రా, ఐజీ రాజేష్, మురళీబాబు, డీఐజీ డి. శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు నవాబ్ శివకుమార్‌గౌడ్, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై శిక్షణ..

చంచల్‌గూడ: బీపీఆర్అండ్‌డీ, హోమ్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ కొత్త చట్టాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం చంచల్‌గూడలోని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు చెందిన శిక్షణ సంస్థ సీకా కార్యాలయంలో డీజీ డా. సౌమ్య మిశ్రా ప్రారంభించారు. ఈ శిక్షణలో జైళ్లకు సంబంధించిన కొత్త క్రిమినల్ చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహితకు సంబంధించి శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు.


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీజీ సౌమ్య మిశ్రా


చైతన్యపురి అంబేడ్కర్‌నగర్‌లో రహదారిపై స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

బయటకు వస్తే భయపెడుతున్నాయ్!

- స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు
- భయాందోళనలో ప్రజలు



చైతన్యపురి: వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కల బెడద నానాటికీ తీవ్రరూపం దాల్చుతోంది. కుక్కల నియంత్రణకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నపిల్లలు ఒంటరిగా కనిపిస్తే మూకుమ్మడి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అంబర్‌పేట ప్రాంతంలో ఇటీవల నాలుగేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేయడంతో మృతి చెందిన ఘటన తెలిసిందే. నిత్యం ఏదో ఓ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం సాధారణమైంది. చైతన్యపురి డివిజన్‌లోని పలు కాలనీలలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కాలనీ అంబేడ్కర్ నగర్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడి నుంచో తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులనే కాక పెద్దలను సైతం భయపెడుతున్నాయి. స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

'నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల నిర్లక్ష్యం'

మన్సూరాబాద్: వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మన్సూరాబాద్ పెద్దచెరువులోని ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులో వినాయకులను నిమజ్జనం చేయటానికి వచ్చే భక్తులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కొలను ప్రాంతానికి తరలివచ్చే ప్రధాన కాలనీలు మల్లికార్జుననగర్, సాయినాథ్‌కాలనీ, చంద్రపురికాలనీలలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని కోరినా స్పందించడం లేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజవర్గ పరిధిలోని ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, మూసారంబాగ్, సైదాబాగ్, ఛావుని, అక్బర్‌బాగ్ డివిజన్లకు చెందిన 30 మంది మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి


కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పలు కాలనీలలో స్ట్రీట్‌లైట్లు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో హరిందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, యాదవరెడ్డి, నవీన్, సతీష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చంపాపేట పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు భేష్

డీఈఓ సుశీందర్‌రావు


అజితవెంకట్రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

చంపాపేట: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చంపాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయుల పనితీరు భేష్ అని రంగారెడ్డి జిల్లా డీఈఓ సుశీందర్‌రావు కితాబునిచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత అజితవెంకట్రాంరెడ్డి తన సొంత డబ్బులతో పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌లో ప్రొజెక్టర్‌ను మంగళవారం ఆయన ఎంఈఓ బాసూనాయక్, హెచ్‌ఎం అనంతరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రీ ప్రైమరీ దశనుంచే ఇంగ్లిష్ మీడియంలో బోధన చేయటంతో పాటు డిజిటల్ క్లాసులు నిర్వహించాలనే ఆలోచన రావటం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సంఘ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, రజిత, అనిత, జ్యోతి, వినయ్‌కుమార్, కావ్య, నర్సింహ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 25, వంకాయ రూ.50, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ. 23-40, కాకర రూ. 38, బీర రూ. 55, క్యాబేజీ రూ.15, ఫ్రెంచి బీన్స్ రూ. 80, క్యారెట్ రూ.60, దొండ రూ.40-50, చిక్కుడు రూ.95, గోకర రూ.50, బీట్‌రూట్ రూ.28, క్యాప్సికం రూ.60, ఆలు రూ.38, దోస రూ. 23, సొర రూ.17, పొట్ల రూ.23, ఉల్లిగడ్డ రూ.54, చామగడ్డ రూ. 45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: బాతుల చెరువులో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తెలిపారు.డివిజన్ పరిధిలోని బాతుల చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం ఆయన సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువు వద్ద శానిటేషన్ పనులు నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెరువు చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్ వెంట డీఈ దామోదర్ రావు, ఎలక్ట్రికల్ ఈఈ పున్న నాయక్, సిబ్బంది లక్ష్మన్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

లింగోజిగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నంద్యాల నందికోట్కూరుకు చెందిన విజయ్‌కమార్‌రెడ్డి(43) కొంతకాలంగా హయత్‌నగర్ కుంట్లూర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేస్తున్నాడు.విజయకుమార్‌తో పాటు నెలక్రితం వరకు అతని సోదరి కుమార్తె చదువు నిమిత్తం ఉండి ఉద్యోగం రావడంతో మరో ప్రాంతానికి వెళ్లిపోయింది. సోమవారం రాత్రి విజయ్‌కుమార్ ఓ యువతిని ఇంటికి తీసుకుని వచ్చాడు. ఉదయం విజయ్‌కుమార్ మృతి చెంది ఉండడంతో యువతి, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

లింగోజిగూడ: భవనంపై నుంచి దూకి చికిత్స పొందుతున్న ఓ వివాహిత మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ చెందిన కమలేశ్వర్ తన భార్య సాధన(22)తో కలిసి ఎల్‌బీనగర్ ఉంటూ కూలి పనులు చేస్తుంటారు. గత కొంత కాలంగా ఇరువురి నడుమ గొడవలు జరుగుతున్నాయి.ఈ నెల 8న ఎల్‌బీనగర్ ప్రజయ్ టవర్స్‌లో పనికి వెళ్లిన సాధన 7వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్ర గాయాలైన సాధనను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌ను ఆమె సందర్శించి కిచెన్, వంట సామగ్రి, కూరగాయలు, వడ్డించిన భోజనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినాలని ఆమె సూచించారు. అంతకుముందు వంట శాలను ఆమె పరిశీలించి విద్యార్థులకు వండుతున్న కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించి, వండిన భోజనాన్ని ఆమె రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పలువురు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ రెస్టారెంట్‌లో తనిఖీలు

పోలీసులు వచ్చేలోపు ఇద్దరు మహిళలు పరార్

లింగోజిగూడ: ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ హోటల్‌లో ఇద్దరు మహిళలు తనిఖీలు చేపట్టడంతో అనుమానం వచ్చిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పరారైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చింతలకుంటలోని కృతంగ రెస్టారెంట్‌కు మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు వచ్చి తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ తనిఖీలు చేపట్టారు. కాసేపటి తర్వాత తాగేందుకు సూప్‌లను ఆర్డర్ చేశారు. హోటల్‌లో నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నారని, పిల్లలతో పనులు చేయిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని అందుకే తనిఖీలు చేపట్టామని చెప్పారు. మహిళల ప్రవర్తనలో అనుమానం రావడంతో నిర్వాహకులు ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు మహిళలు తాము తాగిన సూప్‌కు డబ్బులు చెల్లించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మన్సూరాబాద్: కాళోజీ జయంతిని పురస్కరించుకుని శాతవాహననగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఎల్‌బీనగర్‌లో సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, కృష్ణప్రసాద్, జగదీష్‌రెడ్డి, భరత్‌కాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం ఘటనలో మరొకరి మృతి


అగ్రన్య (ఫైల్)

చంచల్‌గూడ: ఇటీవల తిరుపతి వెళ్లి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో మహబూబ్‌నగర్ భూత్పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబస్తీ కుర్మగూడ డివిజన్‌కు చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కొన ఊపిరితో ఆసుపత్రిలో చేరిన బాలుడు అవుల శ్రేయ అగ్రన్య యాదవ్ (17) సోమవారం రాత్రి మృతి చెందాడు. గత ఆదివారమే తండ్రి దశదిన కర్మ జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం మధ్యాహ్నం సైదాబాద్ ధోబీఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన మృతుడు అగ్రన్య తల్లి, చెల్లి, అమ్మమ్మ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు.

ఐలమ్మ పోరాటం.. ఎందరికో స్ఫూర్తిదాయకం


బీజేఆర్ భవన్ వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనస్థలిపురం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపించారన్నారు. ఎల్‌బీనగర్ చింతలకుంటలో ఐలమ్మ విగ్రహం వద్ద ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న, కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో..

మన్సూరాబాద్: సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాములుగౌడ్, ఫైమీద, కమలమ్మ, మద్దిలేటి, శ్రీనివాస్, లింగస్వామి, లక్ష్మి, శోభ, పార్వతమ్మ, యాదగిరిరెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

బీజేఆర్ భవన్ వద్ద..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ బీజేఆర్ భవన్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమసమాజ నిర్మాణం కోసం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రజాకార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన విప్లవ యోధురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్ నేత, మధుసూదన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్, సైదులు,రమేష్, యాదవరెడ్డి పాల్గొన్నారు.


చింతలకుంటలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కూలిన వృక్షం.. తప్పిన ప్రమాదం

తరచూ కురుస్తున్న వర్షానికి సలీంనగర్ బాలదానమ్మ బస్తీలో మంగళవారం కారుపై ఓ భారీ వృక్షం కూలిపడటంతో ధ్వంసమైంది. పక్కనే ఉన్న టెలిఫోన్ స్తంభం కూడా కూలడంతో తీగలు తెగిపడ్డాయి. అదృష్టవశాత్తూ చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డివిజన్ పరిధిలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భారీ వృక్షాలను ముందుస్తుగా తొలగించాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు. -మలక్‌పేట

తొలగింపు సరే.. తరలింపు ఎప్పుడో?

విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలను తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అయితే.. తొలగించిన కొమ్మలను ఎక్కడికక్కడే వదిలేస్తుండటంతో వర్షాలకు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చైతన్యపురి డివిజన్‌లో పలు కాలనీలలో తొలగించిన చెట్ల కొమ్మలను వారాల తరబడి తరలించకుండా వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి తొలగించిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. -చైతన్యపురి



గణనాథుడికి ఘన పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లోని మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాజకీయ నాయకులు,అధికారులు మండపాలను సందర్శించి గణనాథుడి దర్శనం చేసుకుంటున్నారు. -ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


ఆర్‌కేపురంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సుజాత దంపతులు


వాంబే కాలనీలో.. పూజల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత ప్రభాకర్‌మాదిగ


ఎల్‌బీనగర్‌లో వినాయకుడికి పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ పర్వేజ్


మూసారంబాగ్‌లో మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి


నాగోలు జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్‌లో గణపతి పూజలో పాల్గొన్న మహిళలు


హరిహర క్షేత్రంలో.. గరికతో గణపతికి విశేష అర్చన చేస్తున్న భక్తులు